# కోడలు

కందుకూరి లింగరాజు

సంక్రాంతి పోటీలో రెండవ బహుమతిపొందిన కథానిక



స్కూల్ ఫైనలు చదువుకున్న కోడలు క్రొత్తగా కాపరానికి వస్తోంది అన్న వార్త..., అంతవరకూ నడచిన స్వేచ్ఛ, పెంకితనాలు, మంకుపట్లు, మాట కొంగాయింపు వగైరా వందల విషయాల్లో ఏయే మార్పులు వస్తాయో అన్న భావనోత్సుకం, రాజేశ్వరమ్మకూ, ఆవిడ ఇద్దరి కూతుళ్ళకూ మనసుల్లో మసలింది.

ప్రత్యేకంగా, తను చాకలి పద్దు వేసే వరకూ చదువుకున్న జ్ఞానం, దానికి తోడుగా, అత్తవారింట కాలుపెట్టినది మొదలు ఆడపడుచు పోరులో జీవచ్ఛవమై పోయి, నేటి కాలానికి ఇంక కోడలు కాస్త చెయ్యి ఆసరాగా వుంటుంది అన్న ఆశ కలిగింది రాజేశ్వరమ్మకు. అది కూడా చదువుకున్నది; వింటుందో వినదో అన్న ఆందోళన కమ్మేసి, తన జీవితం ఎప్పుడూ ఒకళ్ళకు సేవచేసుకోవడంతోటే సరిపోయింది, ఇప్పుడు ఎవళ్ళో వచ్చి చేస్తారన్న ఆశ పెట్టుకోవడం ఉత్తి మాఢ్యం, అనుకుంది. ఏమైనా పెళ్ళి నాలుగురోజుల్లోనూ కలసి మెలసిపోయిన కోడలుపిల్ల, తప్పకుండా చెయ్యిజోడుగానే వుంటుందనుకోకుండా ఉండలేకపోయింది.

ఒక్క తీవ్రంగా ఆలోచించిన వారు ఇద్దరు ఆడపడుచులూ; పెద్దావిడ రమణమ్మ, రెండో ఆవిడ మంగమ్మ. ఇక ఇన్నాళ్ళూ సాగిన ఆటలు సాగుతాయో లేవో అన్న జిజ్ఞాసలో మునిగిపోయి, "నాన్నగారు ఎలాగైనా నావైపు" అనుకుని ధైర్యం చెప్పుకున్నది రమణమ్మ. ఇక మంగమ్మ, ఉండిపోయిన కోపం, మార్గపుపట్టుల్లోని ఉత్పాతాలమీద ఆధారపడి, తన్ను తాను అనునయించుకుంది.

ఇంతకీ ఆలోచించకుండా వున్నది అనంతయ్యగారు ఒక్కరే.

ఆ ఏకాదశినాడు కోడలుపిల్ల రానే వచ్చింది. వచ్చేటప్పుడే రెండుబళ్ళ సామానుతో రావడంతో అందరూ ఆశ్చర్యపోయేరు. మంచాలతో పాటు సోలవరకూ సామాను తెచ్చుకుంది. లోపల రాజేశ్వరమ్మగారు, అనంతయ్యగారు కూడా ఆశ్చర్యంలో మునిగిపోయేరు, వియ్యపురాలి ఔదార్యం చూచి.

"కోడలు అన్న పదంలో ప్రతి అక్షరం ఎంత క్రూరంగా జీవితాల మీద పనిచేస్తుందో ఆమెకు అర్థం అయింది. తమ తర్వాత వంశం నిలబెట్టడానికి వచ్చిన లక్ష్మి అనుకుంటూనే ఉచ్చుల్లోకి దింపే పెద్దలు, తమ స్వాతంత్ర్యానికి ఏదో మిత్తిలా అడ్డుకుంటుందనుకునే చిన్నల పన్నాగాలు, అన్నీ అనుభవంలోకి వచ్చేయి. అవి ఎవరూ చేస్తున్నట్లుగా ఉండకనే ఆచరణలో పెట్టబడ్డాయి"

# కోడలు

'చూచేరా! నేను అత్తవారింటికి వెళ్లినప్పుడు, ఆఖరుకు రెండు చాపలైనా పెట్టేరు కారు' అన్న అవహేళనంతోనే, వస్తువు వస్తువు దగ్గరనుండీ పరిశీలించింది రమణమ్మ. మంగమ్మ మాట్లాడకుండా ఉండిపోయింది.

చూచినవాళ్ళు, ఇరుగుపొరుగులవాళ్ళు, వారం రోజులపాటు సామానుల విషయం విడ్డూరంగా చెప్పుకున్నారు. ఇంట్లో వున్న వంటలక్క, నోట్లో చింతకాయ పెట్టుకున్నట్టే. అలవలు పలవలూ అల్లేసి, "కోడలుగారి కేమమ్మా, బంగారపు బొమ్మ. సారెక్రింద తెచ్చింది సరిపోయి, మిగిలిపోయేటట్టు" అని వాడల్లో సాటేసింది.

దీంతో ఆ నెలరోజులూ వచ్చిన వాళ్ళందరికీ ఆడపడుచులు కోడల్ని చూపించడం, అత్తగారు సమయజ్ఞతగా 'నమస్కారాలు పెట్టమ్మా' అనడం, 'ఓసారి వీణవాయించు వింటారు' అనడం, సంగీత కచ్చేరీలు, దాంతర్వాత సారెలో వచ్చిన మిఠాయి పంపకాల్లోటి, తెలియకుండానే రోజులు గడిచిపోయేయి.

ఇంతస్కూలుఫైనలుపిల్లా, నోరు కట్టేసుకుని ప్రదర్శనబొమ్మ అయిపోయింది! రోజూ పెట్టెతియ్యడం, చీరలు చూపించడం ఓ వందసార్లైనా చేసేది. రవ్వలదుద్దులు తడిమి తడిమిచూచే పేరంటాళ్ళతో కొన్నాళ్ళకి అయ్యవార్లంగారి ముత్తైదువైపోతానేమో, అనుకుంది. అయినా మాట్లాడనేలేదు; ఈ అర్థంకాని పరిస్థితుల్లో,

ఆరోజుల్లో 'అతని'కి ప్రక్కగా కూర్చుని భోజనం చెయ్యడం అంటే వల్లమాలిన సిగ్గేసేది. అదిచూచి రమణమ్మ నవ్వడం మరింతగా ఇబ్బంగతీసేసేది.

"ఒదినగారూ, మా ఇంట్లో అలవాటు, కూర్చోండి" అనేది రమణమ్మ.

"స్కూలుఫైనలువరకూ ఇల్లా సిగ్గుపడుతూనే ఎల్లా చదివేరండి" అని మంగమ్మ అండంతో, తప్పనిసరే అయ్యేది. ఏదో తిన్నట్టే ఉండేదికాదు కోడలికి, అలవాటు లేక.

"మా పెద్దనాన్నగారు, ఆడవాళ్లక్రింద జమ కట్టేసి ఇల్లాంటి అలవాట్లు చెయ్యలేదండీ" అందామనుకునేది. అయినా ధైర్యం చాలక 'అతని'వైపు చూసి, కళ్ళల్లోనే భావం కుదించుకునేది.

అనంతయ్యగారూ రాజేశ్వరమ్మా ఈవిషయాలన్నీ నవ్వుకుంటూనేచూచి, రహస్యంగానే, "అపూర్వపురోజుల్లో ఇవన్నీ ఉంటే నేను చేసేసేదాన్ని" అని ఆవిడా, 'పోనీ ఇప్పుడు చెయ్యకూడదూ?' అన్న తలంపులో ఆయనా పులుకూ పులుకూ మనుకునేవారు.

ఆరోజుల్లో ఇంకా ఎన్నో సంతోష విషయాలు సమిష్టిగానే జరిగేయి. ఒక్కదాల్లోనూ కోడలికి తను చాకిరీచెయ్యడానికి వచ్చేనన్నభావం తట్టలేదు. ఆడపడుచులు ఇంత మంచిగా వుంటారా అన్నది ఆశ్చర్యం కలిగించింది. దానికన్న అత్తగారికి మాటలు వచ్చా, రావా అనుకుంది.

'అతని'వైపు ఆరాధనతో చూచేది. ఆ మాట్లాడకుండా, ఎక్కువ మౌనం వహించే, ఆయనలోని నిగూఢం తెలియకనే ఉండిపోయింది.

"జీవితంలో అదృష్టం అన్నది కోరుకుంటే రాదు. దానంతట అదే వలచి వస్తుంది. ఈనాడు ఈ నూత్నపరిసరాలల్లో ఉండి, పుట్టి పెరిగి పెద్దయినవాతావరణాన్ని మర్చిపోతున్నానేమో అనిపిస్తుంది. కొన్నాళ్ళకి పూర్తిగా మైకం క్రమ్మి మర్చిపోతానేమోకూడా..." అని తల్లికి వ్రాసింది.

ఉత్తరంఅంతా అయినతర్వాత 'ఆయన' చేతుల్లో పెడుతూనే చిలిపిగా నవ్వింది. ఉత్తరం చదివేడు. లోపల్లోపలే "ఈ ప్రతి చిన్నవిషయాన్ని కూడా మర్చిపోలేని, ఈ పిచ్చిపిల్లని ఎల్లా పెంచుతానో" అనుకున్నాడు.

ఆ పెళ్లిచూపులనాడే అనుకున్నాడు: తండ్రి లేనిది; ఆమె జీవితంలో లోటులన్నిటికీ తనే, అన్న భావంలో పడిపోయేడు.

నెలలు జరిగేసరికి, తక్కిన విషయాలన్నీ ఎల్లా వున్నా, వంటింటి లక్ష్మిమీదమాత్రం పూర్ణ అధికారం, ఇచ్చేనని ఒకళ్లు చెప్పకుండానే కోడలు చేతిలోకి వచ్చేసింది. అత్తగారి వెనకాల చేదోడుగా వుంటుందని, తనే అన్ని పనులు చెయ్యడంతో, పురమాయింపుల అధికారం చేతికి తగిలింది.

ఇకనుండి ఏ పదార్థాలు చెయ్యాలి, ఏం కావాలి?, ఎల్లా తయారుచెయ్యాలి, అన్నవాట్లతో, పాలు, పెరుగు, పప్పులచిక్కాల బీరువా తాళం చెవి కూడా రొండిలోకి వచ్చింది. దీంతో క్షణం తీరిక లేకుండా ఉండిపోవలసివచ్చింది.

ఇంతవరకూ విచ్చలవిడిగా వదిలి వెయ్యబడి, జమాలెఖ్ఖలు లేకుండానే అవిచ్ఛిన్న సామ్రాజ్యంగా సాగిపోతున్న వంటింట్లో ఆటకాయింపు జరిగి, ఓ విశమైన అదుపాజ్ఞల్లో పడి, కట్టుదిట్టాల్లోకి వచ్చినందుకు, ఆ పని ఇప్పుడు కోడలు చేతుల్లోనే, పకడబందీగా జరుగుతోందని అనంతయ్యగారు సంతోషంతో ఊగిపోయారు. "కోడలూ, ఇన్నాళ్ళనుండీ చెలరేగిపోయే వంటావిడని ఓ దారికి తెచ్చేవు. ఎన్ని సామానులు పోయే యనుకున్నావు. చేసేదాంట్లో సగం గోడలు దాటేవి...ఏదో నువ్వు...మీఅత్తగారు...ముక్కు మొఖం తెలియని మాలోకం..." అన్నారు.

దీనికి సిగ్గుపడిపోయింది. "అంతా అత్తగారు చెప్పేదేనండీ..."

ఈ మాటలు నిజంగా రాజేశ్వరమ్మని సింహాసనంమీద కూర్చోపెడితే... "అల్లా ఘట్టిగా చెప్పు ఆయనకి..." అంది.

రమణమ్మ నవ్వుతూనే "అవును నాన్నారు...అమ్మ ప్రభుత్వంలో రోజూ రెండు కూరలు, పప్పు, పులుసు, రసం, ఉండేవి. ఇప్పుడు పప్పుపులుసు. అప్పడాలు తిని, పైత్యరోగులమై పోతున్నాం. ఏమంచారు ఒదినెగారు...?" అంది.


## బహూమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెండ్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చలవనిచ్చును. "ఉన్మాదము, తలనొప్పి" వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0. 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O) P O Rajdhanwar, (H Bagh).



## అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు. అకాల బహిష్టు, ఋతుబద్ధము. ఋతుశూల. ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ. కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట. నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు. బలహీనత. మలబద్ధము. హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. రు 1/-

ఇండియన్ మెడికల్ హౌస్
లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.)

## అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు.(Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు అసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేరాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము, దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటంవల్ల పెనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపుతాము.

50 బిళ్ళల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

అమృతము వంటి

## అనంగప్రభాయాకుతి

సుందరమైన యౌవ్వనానికి, ప్రకాశవంతమైన తేజస్సుకు ఉత్తమమైనది, ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును బలహీనతచెందిన నరములకు శక్తినిచ్చి పటుత్వమును చేకూర్చును సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరవాదముగలసంజీవి.

30 మాత్రలు రు 10, 15 మాత్రలు రు. 6.

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారు రోడు. మద్రాసు-1.

బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు-పాస్టురోడ్

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్‌రోడ్

నెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్

ఇతర కేంద్రాలలో ఏజెంట్లుకావాలి


# ★ కోడలు ★

అందులోని హేళన అనుకరిస్తూనే మంగమ్మ "ఒదినగారి పెళ్ళిలో అప్పడాలు ఉల్లిపకుల్లా ఒత్తేరే...ఇకనుండి అల్లాంటివి తినవచ్చే" అంది...

ఏమనాలో తెలియక కోడలు అత్తగారి వైపుచూచింది. ఆవిడా "పిళ్ళ మాటలకేం తల్లీ...అల్లాగే అంటారుకే" అంది.

అయినా సముదాయింపుకాలేదు. కోపం వచ్చింది. ఆ ఉదుటులోనే వెళ్ళి..."లక్ష్మీ! ఇవ్వాళ బంగాళాదుంపలకూర, కొబ్బరికాయ పచ్చడి, చారు, సాంబారు పెట్టు" అని సామాను ఇచ్చేసింది.

ఈ చర్యవల్ల మనస్సుకు శాంతి వచ్చిందనుకుంది. అయినా రమణమ్మ మంగమ్మల కిరువురికి లోకువఅయిపోయింది అన్న భావం కలిగింది. వాళ్లు తనకన్న చిన్న వాళ్లు, అనుకుంది.

'ఆతను' ఆశ్చర్యపోయేడు. ఆ రోజు మాత్రం, 'నీ ఉనికికోసం, ఇంటికోడలిని బానిసగా చేస్తున్నావు నీ తండ్రికి, తల్లికి, చెల్లెళ్ళకి,' అని మనస్సు ఆలోచించింది. కొంచెం బాధపడ్డాడు.

సంవత్సరాలు ఉద్యోగంలో గడిచిన కొలదీ, నేర్పు, చాకచక్యం వస్తుందంటారు. అల్లాగే కోడలికి ఇంట్లో ప్రతిపరిస్థితిలోని మూలము అవగాహన అయ్యింది. దాంతో చాకిరీ ఎక్కువైంది. ఆ మొట్టమొదటి నెలల్లో పనిలేకుండా ఉన్న రోజులు, ఇప్పుడు తీరికలేని రోజులకు ఎంత తేడా వుందో అనుకుంది. అయినా, ఎవరైనా తన మీద అధికారం చేస్తున్నారేమో అనుకుంటే, ఒకర్నొకనిపించకనే పోయేరు! అత్తగారు మాట్లాడరు. ఆడపడుచులు నవ్వుతూనే వేళాకోళాలు చేస్తారు. మామగారు ప్రత్యేకంగా పిలిచి 'ఏం కావాలి' అని అడుగుతూనే వున్నారు. 'ఆయన' మాటలురాకుండా వుంటూనే రాత్రిళ్ళు మర్చిపోయేట్టు చేసేస్తారు..ఇంకా ఏం కావాలి అనుకుని, బోళాతనంలో తృప్తిపడిపోయింది.

ఆరోజు అల్లుడుగారు ఉత్తరం వ్రాసేడు-తను మునసబీ సెలక్షన్లో సెలక్టు అయినట్లు. అందరూ సంతోషించేరు. ప్రత్యేకంగా రమణమ్మ పట్టపగ్గాలులేకుండా సంతోషపడింది. ఆ రాత్రి విందే జరిగింది.

రాత్రి పదకొండింటికి లక్ష్మి, తనూ భోజనానికి కూర్చుంటే మూలపురుషుల్లాంచి చింతకాయ పచ్చడి తీసుకుని తినవలసివచ్చింది. సావిట్లో పెంకులెగిరేటట్లు రమణమ్మ, తందానతాన అంటున్నట్లు మంగమ్మ, కబుర్లు చెప్పేస్తున్నారు.

"నాన్నారు మీరు డబుల్ కాట్ చేయించాలి. ఓగాడ్రెజ్ బీరువా, ఓ సోఫాసెట్టు, ఇవన్నీ ఆర్డరివ్వండి." అంటోంది రమణమ్మ.

"అవున్నాన్నారు. బావగారు ఉద్యోగస్తుని హోదాలోకి వచ్చేరుకదా మరి..." మంగమ్మ.

కోడలు తనూ అనాలనుకుంది- ఈ ఎంగిలి విస్తళ్ళమధ్య, అడుగూ పొడుగూ ఊడ్చుకుంటూ, జీతం మనిషి సరసన కూర్చుని... పైగా ఉద్యోగం, సద్యోగం లేకుండా, జులాయిగా వున్నట్టుగా తనూ, ఆయన...తల్చుకోలేక కుమిలింది. దుఃఖం వచ్చింది. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. సగంలో చెయ్యి కడుక్కుంటూ లేచిపోయింది. లక్ష్మి తెల్లబోయింది.

గదిలోకి వెళుతూనే "ఏమండీ! మీరూ ఉద్యోగానికి ఎందుకు ప్రయత్నించకూడదూ!..." అంది.

ఉలిక్కిపడ్డాడు. ఆ అడిగిన స్వరంలోని సప్తస్వరాల ఉద్దీపనకు, నరనరాలు తోడేసినట్లు అయ్యింది.

ఉద్యోగానికి ఎందుకు ప్రయత్నించకూడదూ? కోడలు అడిగినదాంట్లో నిండు నిజం నిబిడీకృతం అయ్యేవుంది. తనే ఇన్నాళ్లూ ఓ విధమైన బద్ధకస్తుని జీవితం అలవాటుచేసుకుని, పైకి ఆ వయస్సుమళ్లిన తండ్రికి ఆసరాగా వుంటున్నానని మెరుగుపెట్టుకున్నట్టు అనిపించింది. "అవును. కోడలుకోసమైనా తనూ ఉద్యోగం చెయ్యాలి" అనుకుని, రెండురోజులలో తల ముహూర్తంపెట్టి, మద్రాస్ వెళ్లిపోయేడు.

* * *

అవ్వాళ భోజనాలదగ్గర అనంతయ్యగారు - "రామన్నపాలెం వెళ్లాలి, ఈదరపల్లి వెళ్లాలి, ఇద్దరు రైతులూకూడా ఎన్నిసార్లు పిలిపించినా రాలేదు. ఇక నేనే వెళ్ళాలి... బకాయి చాలావుంది..."

"అన్నయ్య వుంటే వెళ్లివుండును కాని..." మంగమ్మ సగంలో ఆగిపోయింది.

రమణమ్మ కోడలువైపు చూస్తూనే "అన్నయ్య అంటే రైతులందరికీ భయం. అయినాకాని ఒదినగారూ, అన్నయ్య ఎందుకు వెళ్లేడండి?" అంది.

"నాకూ చెప్పలేదు" అంది కోడలు. కాని అది ఎవరూ నమ్మలేనట్టుగా, ఒకళ్లి మొఖం ఒకళ్లు చూసుకున్నారు.

"ముసలివాళ్లని ఒదిలేసి, ఎవళ్లగారి వాళ్లు చూసుకోడానికి వెళ్లేరు. పైగా భార్య కాపురానికికూడా వచ్చిందిగా..." అంది రాజేశ్వరమ్మ.

దీంతో కోడలు మొఖం తెల్లబడింది. తప్పిదం చేసినట్టుగా బాధ తెరతీసుకుంది. ఒక్క విషయం నిజమే. తను రాకపూర్వం అంతా ఒకటిగ్రిందే ఉన్నారు. ఇప్పుడు తను కాలెట్టడంవల్లనే ఈ సమిష్టి కుటుంబానికి విచ్ఛిత్తి ప్రాప్తిస్తోందా? తనే కారణమా అన్న సమస్య బాధించింది. ఓవిధంగా ఇది లోకధర్మమే అనుకుని అనునయించుకున్నా, ఈనాటికీ 'అతని' చర్యను ఎవరు కూడా హర్షించనట్టే తడుతోంది.

"ఏదోరోజు వాడు వెళ్ళిపోతాడని, వాడి కాళ్లమీద వాడు నుంచోడానికి ప్రయత్నాలుచేసి, సఫలుడౌతాడని అనుకుంటూనే వున్నాను. ఇంకా ఇక్కడ, ఈ క్రొత్త సంసారం సరిగ్గా దారిలో పడనేలేదు. ఇంత త్వరలోనే వెళ్లిపోతాడు అనుకోలేదు నేను.." అందులో బాధంతా ఉట్టిపడినట్లుగా అన్నారు అనంతయ్యగారు.

"మీరే వెళ్తారా" రమణమ్మ అంది.

"ఏంచేస్తాను. వెళ్లకపోతే, తప్పదు..."

ఆయన సరిగ్గా భోజనంచెయ్యనట్టే కనిపించింది. మూడురోజులనుండి కీళ్ళనొప్పులతో బాధపడుతున్న విషయం జ్ఞప్తికివస్తే, కోడలికి, తను తనభర్తని అంత త్వరగా అడగడంలో తప్పేమైనా చేసేనేమోఅన్న భావన ఏర్పడింది. 'ఆయనా' సమాధానం చెప్పకనే వెళ్లిపోయేరు. ఏమిటో అర్థం చేసుకోగలుగుతున్నానన్న ఇల్లు, ఈ విధంగా విచిత్ర దృక్పథాల్లోకి దారితీస్తుం దనుకోలేదు.

లక్ష్మి, తనూ ఆఖరున కూర్చున్నప్పుడు, "మీ మామగారికి ముద్దకూరలు ఇష్టం, రమణమ్మగారికి వేపుళ్లు, మంగమ్మగారికి ప్రతీదాన్లోనూ ఉల్లిపాయలు వెయ్యాలి. ఇక మీ అత్తగారికి ఏది వున్నా సరేనమ్మా...మీరు ఒచ్చినప్పటినుండీ..."

"ఏమైనా అనుకున్నారా?"

"ఏమంటారు? అందరూ మాతులు బిడాయించుకునే తింటున్నారులెండి..."

మాట్లాడలేదు కోడలు.

"మర్చిపోయే. మీరే వారిని తరిమేసి ఉద్యోగం ఊళ్లొక్కసేవరకూ రావద్దన్నారుటకో..."

"ప్రక్కవాళ్లు అన్నారా?"

"అబ్బే! అది కాదండి. ఉన్నది, విన్నది, కన్నది కూడా అంతేకదండీ?"... ఉన్న తెలివితేటల్తో!

"అవును. వెళ్ళమన్నాను" అంది కొంచెం దురుసుగ్గానే.

'ఆ' అంటూనే గోడకు చేర్లబడి, కాస్సేపటికి తేరుకుని, పురిషిడు నూనె పోసి అవకాయవాయ కలిపేసింది.

ఒక్కొక్కటే అర్థం అయీ అవనట్టే అయ్యింది కోడలికి.

రెండు రోజుల అవతల రమణమ్మ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

* * *

ఆ వారం రోజులు ప్రయాణపు బడలికవల్ల అనంతయ్యగారు మంచంమీదనుండి లేవలేదు. రెండు రోజులు లంఖణం చేసేరు. మూడో రోజు పథ్యం పుచ్చుకున్నా మళ్లీ ఐదోరోజుకు తిరగబెట్టింది. అదీ ఉధృతంగా వచ్చి, ఓ ఇరవై రోజులు మంచంమీదనుండి లేవనిచ్చింది కాదు. ఓ రోజు అర్ధరాత్రివేళ డాక్టర్ని పిలడంకూడా వచ్చేసింది.

అసలే మనిషి అర్భకం. పైగా వయస్సు మళ్ళింది. ఇరవైఐదు రోజుల లంఖణముల తోటి బడుగు అయిపోయేడు. ఒంట్లో ఎముకలన్నీ లెఖ్ఖపెట్టవచ్చన్నట్లుగా నీరసించిపోయేడు.

ఆ ఖంగారు పడ్డ రోజున కోడలు మొఖంచూపించలేకపోయింది. తను కాలెట్టగానే 'ఆయన' వెళ్లడం, సుఖంగా అన్ని పనులు 'ఆయన' చేస్తుంటే కృష్ణా, రామా అనుకునే మామగారే ఊళ్ళు వెళ్ళవలసి, బడలికలకు తట్టుకోలేక మంచం ఎక్కడం, ఇంట్లో ఉన్న లక్ష్మి ప్రతీదానికి, తనే కారణం అన్నట్లు సూచించడంతో. ఆందోళన పట్టపగ్గాలు లేకుండా క్రమ్మేసింది. మామగారిని చూడ్డం అంటే భయంవేసింది.

అన్నాళ్ళూ అత్తగారు, ఆయనసేవల్లో మునిగిపోయి మాట్లాడనేలేదు. మంగమ్మ చూస్తూనే ఊరుకుంది. ఈ కావలసినవాళ్లు, తనకి చెప్పకలిగిన వారూ కూడా, మౌనంగా కూర్చుంటూ రెందుకూ అన్న ప్రశ్న బాధించింది ఎక్కువగా.

ఇంక భరించుకోలేక 'అతని'కి ఉత్తరం వ్రాసింది; 'వెంటనే ఓసారి రావలసింది'ని. ఆరోజుల్లో జరిగిన సంగతులు వ్రాయనేలేదు; వ్రాయలేక కాదు, తను వ్రాయలేనన్న బలహీనతల్లో.

ఆ రోజుల్లో ఓ రోజున "వాడు రాలేదా..." ఆయన మగతలో కోడలు ఉండగా అన్నాడు. దీంతో బావురుమన్నట్టే, అత్తగారు "కోడలూ; ఓ టెలిగ్రాం ఇప్పించమ్మా..."

నుంచోలేకపోయింది. గదిలోకి వెళ్ళేసరికి కళ్ళమ్మట నీళ్ళు తిరగేయి. "భగవాన్! నేనేం తప్పుచేసేనని, ఇల్లాంటి పరిస్థితులు కల్పిస్తున్నావ్..." అనుకుని ఏడ్చింది.

పైన చూచేవాళ్లందరికీ కూడా ఆ తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బంధాలు, విచిత్రంగా చెప్పనునేట్లుగా వుంటాయి. ఆయన 'అతనూ' కూడా ఎప్పుడూ ముట్లాడుకున్నట్లే కనపడదు. ఆ మాట్లాడినా వంశపారంపర్య వైషమ్యాలు రవులుకుంటున్నట్టుగా, కస్సు, బుస్సు మన్నట్లే వుంటుంది. ఆయన ఎప్పుడూ ఘట్టిగా, ఎదటకు పిల్చిచెప్పడు. 'అతనూ' ఎదుటికి రానేరాడు.

ఇద్దరికీ సరస్వతీ నదిలాంటిది ఏదో వుండే వుంది. పనులుమాత్రం, ఆయన అనుకున్నట్టుగా 'అతను' చేస్తాడు. అవి అయిపోతూనే వుంటాయి 'అతని' ఆధ్వర్యంలో, పైకి కనపడకుండానే.

పైవాళ్ళందరూ 'అతనిమాట అంటేనే భయం,' 'ముసలాయినను ఏడిపిస్తాడు,' 'ఎప్పుడూ ఆ గదిలోనే మ్రగ్గిపోతూ వెధవ కథలన్నీ వ్రాస్తూ వుంటాడు,' ఇల్లా అనుకుంటారు.

అర్థంకాని, భాష్యం చెప్పలేని, అనురాగం వాళ్లిద్దరిమధ్యా ఉండిపోయింది.

ఇది ఈరోజున అర్థం అయినట్లే అనిపించింది కోడలికి—'వాళ్ళిద్దర్నీ ఎడబాటు చెయ్యడం కష్టం. అది వట్టి మూర్ఖత్వం. ఒకట్రె చెట్టు, రెండోది దాని ఫలం' అన్నట్లుగా.

మర్నాడు లక్ష్మి చాటేసింది. "అనంతయ్యగారు కొడుకోసం బెంగపెట్టుకున్నారు. రాత్రి పలవరించేరుట కూడాను. కోడలు తరిమివేసిందికాని, లేకపోతే కలకలాడే ఇల్లు, ఇల్లా అవుతుందా? - బెంబేలుపడి, అంపకాలకోసం, టెలిగ్రాం ఇచ్చేరుట..." ఆ వరసలో.

కోడలు చెవుల్లో ఇవి సోకేయి. భోజనాల దగ్గరనే "లక్ష్మీ! ఎవరి హద్దుల్లోవాళ్లు ఉండడం మంచిది. అది శ్రేయస్కరం కూడాను. అది దాటితే, ఉండినవాళ్లకీ, ఉంచుకున్నవాళ్లకీ కూడా కష్టంగానే వుంటుంది.

"తగుదునమ్మా అని, జడ్జీల్లా...ఋణపడవలసిన ఇంటికి దూలాలు, వాసాలు లెఖ్ఖపెట్టి, ఇతరుల కళ్లల్లో న్యూనపర్చాలని ప్రయత్నించడం మొదటికే మోసం ఏర్పడుతుంది.

"ఇవ్వాళ ఇరవైఎనిమిదో తారీఖు ఒకటో తారీఖుతో నువ్వు పని మానెయ్యవచ్చు..." అంది.

దిక్కులు తెలియక కళ్లమ్మట నీళ్లు తిరిగేయి లక్ష్మికి...

# ★ కోడలు ★

రాజేశ్వరమ్మా, మంగమ్మా కూడా ఆశ్చర్యపోయేరు. సంతోషపడనూపడ్డారు. దాన్ని ఒదుల్చుకోవాలన్న కోర్కె చాలా రోజులనుండి ఉంది. అది చెయ్యలేక పోయేరు.

అయినా మంగమ్మ కళ్లల్లో 'రేపటి నుండి...' అన్న అనుమానం చూపింది.

'ఎవళ్ళింట్లో పని వాళ్లు చేసుకోవడంలో తప్పేముంది.' అన్నట్లు కోడలు ముఖంలో ధీమా కనపడింది.

ఆ ఒకటో తారీఖున అణా పైసలు లెఖ్ఖ పెట్టి లక్ష్మి చేతులో పెట్టేసింది.

"కోడలుగారు కొలెట్టిందమ్మా, మొదట 'ఆయన్ని', తర్వాత రమణమ్మని, ఆవెనుక నన్ను పంపేసింది. ఆయనా వెంగటిల్లే పోయేరు. మహానుంచావిడి..." అని గొణుక్కుంటూ నేపోయింది లక్ష్మి!

కోడలుకు నవ్వు వచ్చింది.

"మంచిపనిచేసేవు కోడలా" అన్నారు అనంతయ్యగారు.

ఆ ఆదివారం 'ఆయన' మద్రాస్ నుండి వచ్చేసేరు.

* * *

రమణమ్మ శాల్మమ్మగారికి ఉత్తరం వ్రాసింది, ఐదోనెల వస్తోందని. ఆరోజు ఆవిడా అనంతయ్యగార్లు సంతోషం పట్ట పగ్గాలు లేకుండా ఉబికింది. మొట్టమొదటగా వంశంలో మనుమడో, మనమరాలో పుడు తుంది అన్న ఆనందం వెన్ను విరుచుకుంది.

ఒకళ్లతర్వాత ఒకళ్లు ఆలోచనలు చేసేరు. సమిష్టిగా తర్జనభర్జన చేసేరు. నిర్ణయాలు లేకుండానే మేడలు కట్టేసేరు.

కోడలుకు ఇవన్నీ పైకి సమంజసంగా కనపడ్డా, తన్ని ఏదో వలితిగా చూస్తున్నట్లు కనిపించింది. తన కాపురంలో వంశోద్ధార కుణ్ణి ఇవ్వలేనట్లు, ఇచ్చే ఆశలు లేనట్లుగా చూపులు ఉండిపోయేయి!

ఏదో న్యూనతపడ్డట్లే అనుకుంది. మనస్సు బాధించింది.

వెర్రిగా ఆలోచించడం తప్పు అని తెలిసి వున్నా, కోడలు ఆలోచించకుండా వుండ లేకపోయింది.

* * *

'ఆయన' ఇంటర్వ్యూకి అటు వెళ్లడం, ఇటు రమణమ్మగారికి నూడిదలుఇచ్చి తీసుకు రావడం ఒక్కసారి జరిగేయి.

ఈసారి రమణమ్మ రావడంతోటి ఆ ఇంట్లో నూతన్నాధ్యాయం ప్రారంభమైంది. అందరూ ఒకరితర్వాత ఒకళ్లు, 'రమణమ్మకి ఏం కావాలో' అని క్షణక్షణానికీ అడగం, అవన్నీ ఘంటకు ఒకటి జ్ఞాపకంచేసుకుంటూ పురమా యింపులు చెయ్యడంతోటి సరిపోయింది.

ఉదయం ఆరు ఘంటలకు ముందే లేచి వంటింట్లో ప్రవేశిస్తే, రాత్రి పదకొండు ఘంటలవరకూ కూడా ఊపిరాడకుండా చాకిరీ చెయ్యడంతో సరిపోయింది కోడ లుకు.

మంగమ్మా, అత్తగారు కూడా పాలి మేరలకైనా రాకుండా, పురమాయింపు లతో కాలం గడిపేసేరు. ఒక్కొక్కసారి చెయ్యలేని నిస్సత్తువలో—'లక్ష్మిని,చాలా చిన్న విషయంమీద అనవసరంగా మానిపించే నేమో' అని తట్టేది. అయినా అందరూ మెచ్చుకున్నారు. ఆ మెచ్చుకోడం, ఇప్పుడు కచ్చడాలక్రిందే తయారైంది.

'ఆతను' ఉంటే, ఇంత శ్రమా మర్చి పోయివుండేది. ఆ రాత్రి ఒక్కర్తీ ఆ ప్రక్కమీద పడుకున్నప్పుడు, ఉన్మత్త రాత్రిళ్ళన్నీ కలలుక్రింద వచ్చేవి. ఇప్పుడు ఈ శూన్యంలో, రంగులు కలుపుకోవాలంటే పిచ్చిగా వుండేది.

క్షణికం, అవన్నీ తిరిగిరావు, అన్న భయం వేసేది. ఆ మొదటి రాత్రి తన ఉన్న తికీ, ఈనాడు తను ఉన్న స్థితికీ, కాలం మార్పు కలిగించింది. ఈనాడు ఇంటిల్ల పాతికీ, ఓ బానిస అయ్యింది. కోడలు అన్న పదంలో ప్రతీ అక్షరం ఎంత క్రూరంగా జీవితాలమీద పనిచేస్తుందో అర్థం అయ్యింది. తమ తర్వాత వంశం నిలబెట్టడా నికి వచ్చిన లక్ష్మి అనుకుంటూనే ఉచ్చు ల్లోకి దింపే పెద్దలు, తమ స్వాతంత్ర్యానికి ఏదో మిత్తిలా అడ్డుకుంటుందనుకునే చిన్నల పన్నాగాలు, అన్నీ కూడా ఇప్పుడు అనుభవంలోకి వచ్చేసేయి. అవి ఎవరూ చేస్తున్నట్లుగా ఉండకనే, ఆచరణలో పెట్ట బడ్డాయి.

ఇంత పతనానికి తన మంచితనమే కారణ మేమో అనుకున్నా, వాళ్ళ చెడ్డతనం తను నిరూపించలేని విషయంలా తట్టి, తన మంచి తనాన్ని గూర్చి ఆలోచించడం కూడా మూర్ఖత్వం అని తోచింది.

ఆ రోజుల్లో మనస్సు పరిపరివిధాల ఆలో చనల్లో మునిగిపోవడంతో, తిండి తినలేక పోయింది. ఓ విధమైన న్యూనత, కుమిలిం పుల్లో బాధపడింది. నేను బానిసఅయ్యేనా? అన్న ప్రశ్న ప్రతీ చిన్న విషయంలోనూ ప్రశ్నించేది. "అవునోయ్ కోడలూ, నువ్వే. ఈ ఇంటికంతటికీ పెద్ద బానిసవు.. నౌక రివి...చాకిరీచేసే యంత్రానివి" అన్నట్లు శూలాలు పొడిచేవి.

ప్రత్యేకంగా ఆరోజు వచ్చేసింది.

రమణమ్మకు నొప్పులు ప్రారంభం అయ్యేయి. నర్సు, డాక్టరమ్మ వచ్చేరు.




## లల్లూరాం అండ్ కో

(స్థాపితము 1928.)

ఏన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన

* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు

* క్యాషు బాక్సులు

## లల్లూరాం అండ్ కో

వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.

"శాంతి షోరూమ్ - మారుతి సినిమా ఎదురుగా."

## నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహ ము, వీర్యనష్టము, నిస్సత్తువ, శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలి గించు వరప్రసాదము—

20 తులా డబ్బి రు. 8-4-0 పోస్టేజి 15 అ.

పి. వి. వి. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా.

ప్రసిద్ధమైన నంజన్‌గూడు పండ్లపొడి వారి

అగత్యమైన కుటుంబ ఔషధములు

కాస్మస్ — కస్తూరి మాత్రలు...

కర్జక్ — గోరోజన మాత్రలు...

బాలక్స్ — పిల్లలకుపయోగపడు మాత్రలు...

మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు

యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1, విజయవాడ.